బీసీలను అణిచేందుకు ప్రభుత్వం కుట్ర

- కులగణనను పూర్తిస్థాయిలో ప్రకటించాలి
- ఈడబ్ల్యుఎస్‌ను కాపాడుకునేందుకే..
- బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మద్దూరు మండలాధ్యక్షుడు గోపాల్

మాట్లాడుతున్న బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్

మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 5: తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కులగణన సర్వే లెక్కల్లో తప్పులతడకగా చూపించి బీసీలను అణచి వేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతుందని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్ అన్నారు. బుధవారం బీసీ సమాజ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లను దెబ్బతీసి ఈడబ్ల్యుఎస్‌ను కాపాడుకునేందుకే బీసీ జనాభను తక్కువ చేసి చూపిస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సమగ్రంగా వీటిని సమీక్షించి పూర్తిస్థాయిలో కులగణాంకాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో లెక్కల ప్రకారం ఓసీ, బీసీ జనాభా శాతం పెరిగిందన్నారు. ఇప్పటి ప్రభుత్వం చేసిన సర్వేలో మాత్రం ఓసీ జనాభ పెరిగి, బీసీ జనాభ మాత్రం 52శాతం నుంచి 46 శాతానికి ఎలా తగ్గుతుందని నిలదీశారు. బీహార్ ప్రభుత్వం కుల గణన చేపట్టిన తర్వాత అక్కడి సీఎం 26సార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించారని.. ఇక్కడున్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఏరోజు అధికారులతో కులగణనపై సమావేశాలు నిర్వహించక పోవడం ఆచర్యం కలిగించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా నుంచే బీసీల తిరుగుబాటు మొదలవుతుందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, నాయీ బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు సత్యం, చంద్రమోహన్, ఆశన్న, శేఖర్, విశ్వనాథం, సుకుమార్, రఘు పాల్గొన్నారు.

బీసీలను ఎలా లెక్కించారు

కుటుంబ సర్వేకు దూరంగా ఉన్న ప్రజలను ప్రభుత్వం లెక్కిల్లోకి తీసుకుందా.. తీసుకుంటే బీసీ జనాభ ఎలా తగ్గుతుందని బీసీ మేధావుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన సమగ్ర సర్వేను ఇప్పటి సర్వేను పరిశీలించి న్యాయమైన సర్వేను ప్రటించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలన్నారు.

మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

మద్దూర్, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల తప్పుడు లెక్కలతో మోసం చేస్తుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గోపాల్ విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలో 52శాతం ఉన్న బీసీలు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణనలో 46 శాతానికి తగ్గడం చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలపై ఉన్న ద్వేశాన్ని అర్థం చేసుకోవచ్చన్నారు. తప్పుడు లెక్కలతో బీసీలను మోసం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినట్లు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

బీసీలపై చిన్నచూపు తగదు

ధన్వాడ, ఫిబ్రవరి 5: శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీఆర్ఎస్ మండల నాయకులు మల్లేశ్ గౌడ్, మేకల నర్సింహులు, శ్రీనివాసలు, వెంకటేశ్‌ములు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మట్లాడుతూ.. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఏమైందని ప్రశ్నించారు. బీసీలపై కాంగ్రెస్ ప్రభుత్వం సవతితల్లీ ప్రేమ చూపిస్తుందని ఆరోపించారు.

కులగణన అంతా బూటకం

నారాయణపేటరూరల్, ఫిబ్రవరి 5: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే తప్పుల తడకగా ఉందని బీఆర్ఎస్ యువజన నాయకుడు వెంకటేశ్ ముదిరాజ్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సర్వేలో ముదిరాజ్‌లు 50లక్షల నుంచి 60లక్షల వరకు ఉన్నారని లెక్కలు చెప్పాయని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల గణన సర్వేలో ముదిరాజ్‌లు 26లక్షలు మాత్రమే ఉన్నట్లు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

సాయిధ పోరాటంలో పాటనే ఆయుధం

- పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు, ఫిబ్రవరి 5: నిజాంలకు వ్యతిరేకంగా జరిగిన సాయిధ పోరాటంలో పాటనే ఆయుధ మైందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కవిగా, కళాకారుడిగా, మహా వాగ్గేయకారుడిగా అంతకు మించి జీవితమంతా కష్ట జీవులకోసం అంకితం చేసిన వ్యక్తి సుద్దాల హనుమంతు అని పేర్కొన్నారు. తెలంగాణ జాతి యావత్తుని తన కవితలతో మేల్కొలిపిన మహాకవి అన్నారు. సాయుధ పోరాటంలో ఆయన రాసిన పల్లెటూరి పిల్లగాడ పసుల గాసే పాట ఎందరినో ప్రభావితం చేసిందన్నారు. అనంతరం సుద్దాల హనుమంతు జీవితం సాహిత్యం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నమీబియా దేశ పూర్వపు మాజీ మంత్రి బెర్నార్డ్, డా.మధుసూదన్‌రెడ్డి, బెక్కం జనార్దన్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కొర్రమీను పెంపకంతో అధిక లాభాలు

- నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

మాట్లాడుతున్న పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

మరికల్, ఫిబ్రవరి 5: రైతులు కొర్రమీను చేపల పెంపకంతో అధిక లాభాలు పొందవచ్చని పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి సూచించారు. మండల కేంద్రంలో నాబార్డు, రాంకీ ఫౌండేషన్ సహకారంతో ఉదయ్ ఆక్వా కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేట్ ఫిష్ కల్చర్ డెవలప్‌మెంట్ పథకాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేవలం నాలుగు గుంటల భూమిలో కొర్రమీన సాగు చేయొచ్చని పేర్కొన్నారు. అత్యున్నత విధానంలో సాంకేతిక పద్ధతిలో చేపల పెంపకం చేపట్టడంతో రైతులకు అధిక లాభాలు వస్తాయని తెలిపారు. రైతులు ఈ చేపల పెంపకానికి రూ.4.41లక్షలు ఖర్చు పెట్టాల్సి వస్తుందని, పీఎంఈఈపీ కింద 35శాతం రాయితీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఏడాదిలో మూడు పంటలు తీయొచ్చని తెలిపారు. కొర్రమీను పెంపకంపై రైతులు శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ అధినేత రాంరెడ్డి, ఉదయ్, సుజీర్ నాయర్, సూర్య మోహన్‌రెడ్డి, చంద్ర మోహన్ రెడ్డి, మోహన్, ఇందు తదితరులు పాల్గొన్నారు.

నరికిన చోటే మొక్కలు నాటారు

మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

నవాబ్‌పేట, ఫిబ్రవరి 5: మండలంలోని జంగమయ్యపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులతో చెట్లు నరికించిన ఉపాధ్యాయులు బుధవారం పాఠశాల ప్రాంగణంలో కొత్తగా మొక్కలు నాటారు. బుధవారం నమస్తే తెలంగాణ దినపత్రికలో విద్యార్థులతో పచ్చని చెట్లు నరికివేత.. శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎంఈవో నాగ్యానాయక్ స్పందించారు. విద్యార్థులతో చెట్లు నరికివేయించిన హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందుకు నరికివేయించారోనని.. వారితో లిఖిత పూర్వకంగా లెటర్ రాయించుకొని.. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటాలని ఆదేశించారు. దీంతో తేరుకున్న ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

నిరుపేదలకు భూపంపిణీ చేయాలని ధర్నా

తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కూలీలు

హన్వాడ, ఫిబ్రవరి 5: భూమి లేని నిరుపేదలకు 718లో ఉన్న 300ఎకరాల భూమిని పంపిణీ చేయాలని తెలంగాణ వ్యవసాయ వృత్తి దారుల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటయ్య మాట్లాడుతూ.. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం హన్వాడ రెవెన్యూ శివారుల్లోని సర్వే నెం 718లో 300ఎకరాల ప్రభుత్వం భూమి ఉందని.. ఆ భూమిని భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చి నాలుగు నెలలు కావస్తున్నా నేటికీ భూమి పంపిణీ చేయడంలేదని ఆరోపించారు. వ్యవసాయం కూలీలుగా ఉన్న 40మందికి పట్టాలు ఇవ్వాలని కోరారు. పదిరోజుల్లో భూ పంపిణీ చేయకుంటే కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తాసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి నాగన్న, రాష్ట్ర మహిళా కార్యదర్శి జ్యోతి, నాయకులు రాజు, శ్రీనివాసులు, జుక్యానాయక్, లక్ష్మణ్‌నాయక్, గోవింద్, సురేశ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- కలెక్టర్ విజయేందిరబోయి

మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 5: దివ్యాంగుల సంక్షేమాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి దివ్యాంగులు (పీడబ్ల్యూడీఎస్) కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చట్టాలకు సంబంధించిన అంశాల అమలుకు నూతన కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కమిటీ పదవీకాలం 2ఏండ్లు ఉంటుందని కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారన్నారు. దివ్యాంగులైన సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఐసీడీఎస్ పీడీ జరీనా బేగం, సాంఘిక సంక్షేమశాఖ డీడీ సుదర్శన్, అదనపు డీఆర్‌డీవో భోజప్ప, విద్యాశాఖ ఏడీ అనురాధ, ఎల్‌డీఎం భాస్కర్, డీఎంసీ మెప్మా లక్ష్మి, ఆర్పీలు అనురాధ, నాగలక్ష్మి, డీఎస్పీ, సీఐలు, పీడబ్ల్యూడీ మెంబర్లు శ్రీనివాసులు, కుమారి లక్ష్మి, కవిత, భాస్కర్, బిచ్చయ్యానాయక్, మధు, దుర్గాప్రసాద్, రాజు, నరేందర్, ప్రేమ్‌కుమార్, యాదయ్య, హరిణి, పారిజాత, రజిత పాల్గొన్నారు.

బేటీ బచావో-బేటీ పడావో అవగాహన ర్యాలీ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 5: బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బుధవారం కలెక్టరేట్ నుంచి క్రిస్టియన్‌పల్లిలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ విజయేందిర బోయిముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాలికల విద్య, భాగస్వామ్యాన్ని విస్తృత పర్చాలన్నారు. బాలికల సంక్షేమ సేవలపై అవగాహన కల్పించడమే దీని ప్రధాన లక్ష్యమన్నారు. ఆడపిల్లలను రక్షించండి.. ఆడపిల్లలను చదివించండి అని నినాదాలు చేశారు. ఆడ, మగ తేడాను వీడాలని, అందరూ సమానమేనని వెలుగెత్తి చాటాలన్నారు. అమ్మాయిలు నేటి ఆధునిక సమాజంలో అన్నిరంగాల్లో మగవారికంటే దీటుగా రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ అధికారిణి జరీనా బేగం, ఎంవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, లీడ్‌బ్యాంక్ మేనేజరు భాస్కర్, జిల్లా మాస్ మీడియా అధికారిణి మంజుల, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలకార్మికులను నిర్మూలించాలి

నారాయణపేట, ఫిబ్రవరి 5: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎస్పీ యోగేశ్‌గౌతమ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ స్మైల్ 11 కార్యక్రమంలో భాగంగా జనవరి 1నుంచి 31 వరకు పోలీస్ శాఖ వివిధ శాఖలతో సమన్వయం చేస్తూ జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. తనిఖీలో మొత్తం 66 మంది బాలకార్మికులను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఇందులో 49 మంది బాలుర, 19 మంది బాలికలు ఉండగా, 18మంది ఇతర రాష్ట్రాలకు చెందిన బాలకార్మికులు ఉన్నారని తెలిపారు. ఇద్దరు యజమానులపై కేసులు నమోదు చేసి, 13మంది బాలకార్మికులుగా పెట్టుకున్న యజమానులకు రూ.74వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

వేరుశనగ @రూ.6,616

పాలమూరు, ఫిబ్రవరి 5: పాలమూరు వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం రైతులు వేరుశనగను భారీగా తరలించారు. గరిష్ఠంగా క్వింటాకు రూ.6616, కనిష్ఠంగా రూ.4వేలు పలికింది. మొత్తం 5,681 క్వింటాళ్ల వేరుశనగ మార్కెట్‌కు వచ్చినట్లు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి బాలమణి తెలిపారు. అదేవిధంగా రాగులు ధర గరిష్ఠంగా రూ.4,334, కనిష్ఠంగా రూ.3,829 పలికినట్లు తెలిపారు.

డ్రైనేజీ, సీసీరోడ్లు నిర్మిస్తాం

జడ్చర్ల, ఫిబ్రవరి 5: జడ్చర్ల మున్సిపాలిటీలోని 18వ వార్డులో త్వరలోనే డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడతామని మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత వార్డు ప్రజలకు తెలిపారు. బుధవారం మున్సిపాలిటీలోని 18వ వార్డులో వార్డు కౌన్సిలర్ మహ్మద్ రహీ మొద్దీన్‌తో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని అంతర్గత రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు. కాలనీలవాసులు పరిశుభ్రతను పాటించాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయరాదని, చెత్త బండ్లలోనే వేయాలని సూచించారు. కార్యక్రమంలో మీన్హాజోద్దిన్, ఖయ్యూం, లక్ష్మయ్యగౌడ్, తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

- మాల సంఘాల జేఏసీ కో చైర్మన్ మంత్రి నర్సింహయ్య

మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 5: ఎస్సీవర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, కులగణన చేయకుండా వర్గీకరణ ఎలా చేపడుతారని మాల సంఘాల జేఏసీ కో చైర్మన్ మంత్రి నర్సింహయ్య ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వన్ మెన్ కమిషన్ ఇచ్చిన రిపోర్టును చించివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన నివేదికను వ్యతిరేకిస్తూ ఏ విధంగా వర్గీకరణ చేస్తారని ప్రశ్నించారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా, మాలల స్థితిగతులపై అధ్యయనం చేయకుండా తప్పుల తడకగా ఇచ్చిన వన్ మెన్ కమిషన్ ఇచ్చిన రిపోర్టు ఎలా పరిగణంలోకి తీసుకుంటారని విమర్శించారు. 1932లో మాత్రమే కులగణన జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చెప్పారని అలాగైతే 2011 జనాభ లెక్కల ప్రకారం ఎస్సీ వర్గీకరణ ఎలా చేస్తారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జనాభను తక్కువ చూపి, ఓసీ జనాభాను ఎక్కువ చూపించుకోవడం ఈడబ్ల్యూసీ రిజర్వేషన్లను కాపాడుకోవడమేనన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, చెన్నకేశవులు, మాలమ్మ, రాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వన్‌మెన్ కమిషన్ రిపోర్ట్‌ను చించివేస్తున్న నాయకులు

జాతీయ నాయకుల విగ్రహాలను యథాస్థానంలోనే ఉంచాలి

జడ్చర్ల, ఫిబ్రవరి 5: జడ్చర్ల మున్సిపాలిటీలోంచి వెళ్లే 167వ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పట్టణంలోని కూడళ్లలో ఉన్న జాతీయ నాయకులు విగ్రహాలను యథాస్థానంలోనే ఉంచాలని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పట్టణంలోని కూడళ్లలో ఉన్న జాతీయ నాయకులు విగ్రహాలను తొలగించాల్సి అవసరం ఉందని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు సూచించారు.. మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ, జడ్చర్లకు చెందిన పట్టణవాసులు, అఖిలపక్ష నాయకులు, కులసంఘాల నాయకులతో బుధవారం జడ్చర్లలోని అంబేద్కర్ కళాభవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అందరి అభిప్రాయాలను సేకరించారు. సమావేశంలో చాలామంది రోడ్డువెడల్పులో విగ్రహాలను తొలగిస్తే మళ్లీ ఆ విగ్రహాలను ఇప్పుడున్న స్థానాల్లోనే పునప్రతిష్ఠించాలని సూచించారు. అలా కానిపక్షంలో విగ్రహాలను తొలగించొద్దని తెలిపారు. అదేవిధంగా విగ్రహాలకు సముచిత స్థానాన్ని కల్పించేలా చూడాలని అధికారులకు తెలిపారు. ఇందుకు సంబంధించి విగ్రహాలను ఇప్పుడున్న స్థలాల్లోనే ఉంచుతామని జాతీయ రహదారుల సంస్థ అధికారుల నుంచి ఒక ఉత్తర్వు తీసుకొచ్చిన తర్వాతనే విగ్రహాలను తొలగించాలని అందరూ సూచించారు.

అధికారులతో చర్చిస్తున్న అఖిలపక్ష, కులసంఘాలు

టౌన్‌హాల్ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు భారీ ర్యాలీ

నిరసన వ్యక్తం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 5: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మి, కర్షక, వ్యవసాయ కూలీలకు మొండి చెయ్యి చూపించిందని రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, కార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ టౌన్‌హాల్ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు కూలీలకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైందని, వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ, స్కీం వర్కర్స్, ఆశ వర్కర్లకు బడ్జెట్ తగ్గించి మోసం చేస్తుందని విమర్శించారు. దేశ బడ్జెట్‌ను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి దేశాన్ని నాశనం చేస్తుందన్నారు. కార్మికులకు లేబర్ కోడ్ తీసుకొచ్చి ఇబ్బందుల్లోకి నెడుతుదన్నారు. స్కీం వర్కర్లను పర్మినెంట్ చేసి రూ.26వేల జీతం అమలు చేయాలని, కార్మికుల పని వేళలను 12నుంచి ఎనిమిది గంటలకు తగ్గించాలని డిమాండ్ చేశారు. జిల్లాకు కొత్త రైల్వే, పాలమూరు-రంగారెడ్డి పాజెక్టుకు జాతీయ హోదా కల్పించడంలో విఫలమైందన్నారు. కేంద్రం కార్పొరేట్ సంస్థలను కాపాడుకోవడం మానుకొని, కార్మిక, కర్షకుల గురించి ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో సురేశ్, అల్వారెడ్డి, అరుణ్‌కుమార్, వెంకటేశ్, సాంబశివుడు, శశికళ, యాదమ్మ, అమృత, పద్మ పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా ఇవ్వాలి

నారాయణపేట, ఫిబ్రవరి 5: ఉపాధి హామీలో 20రోజుల పని దినాలతో సంబంధం లేకుండా భూమిలేని వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12వేలు ఇవ్వాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సలీం, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని భగత్‌సింగ్ భవన్‌లో ఏఐపీకేఎంఎస్ జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో ఎలాంటి ఉపాధి లేక పనులు దొరక్క పేదలు పట్టణాలకు వలస పోతున్నారన్నారు. భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వం భూమి ఇవ్వాలని, ఇల్లు లేని వారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. వ్యవసాయ కార్మికులకు ఎలాంటి రక్షణ లేకుండా పోయిందని, సమగ్ర వ్యవసాయ కూలీల చట్టానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వ్యవసాయ కూలీల సమస్యలు చర్చించి పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాములు, చెన్నప్ప, సహాయ కార్యదర్శులు హాజిమల్లాంగ్, కనకరాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సలీం

నిరసనలో పాల్గొన్న నాయకులు

బడ్జెట్‌లో కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 5: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మిక వర్గాల డిమాండ్లు పరిష్కరించకపోగా తీవ్ర అన్యాయం చేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం అన్నారు. బుధవారం జాయింట్ ప్లాట్ ఫార్మ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, కిసాన్ సంయుక్త మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక బడ్జెట్ అన్నారు. కార్యక్రమంలో మాస్‌లైన్ జిల్లా నాయకులు కాశీనాథ్, టీయూసీఐ జిల్లా కార్యదర్శి నర్సింహ పాల్గొన్నారు.

దళితులు ఐక్యంగా ఉద్యమించాలి

మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 5: భారత అత్యున్నత న్యాయస్థానం తీర్పు తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేపట్టిన చర్యలతో వర్గీకరణపై దళితులు ఐక్యంగా ఉద్యమించాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి బుధవారం ప్రకటనలో తెలిపారు. మూడు దశాబ్దాలుగా కొనసాగిన ఎస్సీ వర్గీకరణ ఉద్యమం యావత్తు సమాజాన్ని కదిలించిందన్నారు. ఇందుకు ఉద్యమించిన మాదిగ ఉప కులాలు, వర్గీకరణకు సమ్మతిని తెలిపిన మాల ఉపకులాలను సమాజం గౌరవించాలన్నారు. చరిత్ర పొడువునా అంటరానితనం, అవిద్య, ఆకలి వంటి తీవ్ర సమస్యలతో వేధింపబడిన దళితులు ఇప్పుడే తమకోసం తాము నిలబడే పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చొరవ చూపినట్టే.. ఎస్టీ వర్గీకరణకు కూడ చొరవ చూపాలని డిమాండ్ చేశారు. దళితులు, ఆదివాసులు సహజ వనరులతో సామాజిక సంపద కోసం ఐక్యంగా ఉద్యమించాలని కోరారు.

బైక్ సైకిల్ ఢీకొని వృద్ధుడు మృతి

బాలానగర్, ఫిబ్రవరి 5: మండలంలోని హేమాజీపూర్ శివారులో మంగళవారం సాయంత్రం బైక్ ఢీకొట్టిన ఘటనలో వృద్ధుడు తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతిచెందాడు. గాంధీపాలెంకు చెందిన సుబ్యా హేమాజీపూర్ – గాంధీపాలెం మధ్య నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుబ్యాను షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఉస్మానియా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతిచెందాడు. సుబ్యా కుమారుడు గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై లెనిన్ తెలిపారు.

బావిలో పడి బాలుడు..

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), ఫిబ్రవరి 5: బావిలో పడి 15ఏండ్ల బాలుడుడు మృతి చెందిన ఘటన చింతకుంట మండలంలో చోటుచేసుకున్నది. స్థానికులు, బంధువుల కథనం మేరకు.. మండలంలోని మద్దూర్‌కు చెందిన గొర్ల కాపరి గొల్ల కురుమూర్తి(15) బుధవారం దాదాపు 10గంటల సమయంలో అమరచింత మండలం చంద్రప్పతండా శివారులోని హనుమంతు నాయక్, కృష్ణ నాయక్ వ్యవసాయ పొలంలో ఉన్న బావిలో నీరు తేవడానికి వెళ్లి ప్రమాదశాత్తు పడి మృతి చెందాడు. ఈత రాకపోవడంతో ఊపిరి ఆడక మరణించినట్లు అనుమానం వ్యక్త చేశారు.

డీసీఎం ఢీకొని ఇద్దరికి గాయాలు

బాలానగర్, ఫిబ్రవరి 5: మోతీగణపూర్ శివారులో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కాతమ్ముడికి తీవ్ర గాయాలయ్యాయి. మోతీగణపూర్‌కు చెందిన విజయసింహారెడ్డి, సోదరి తరుణ బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యంలో నవదుర్గ పరిశ్రమ సమీపంలో డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయసింహా రెడ్డి తరుణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై లెనిన్ తెలిపారు.

తప్పు చేసిందొకరు.. శిక్ష మాకా?

- ఎమ్మెల్యే, కలెక్టర్‌ను ఆశ్రయించిన పీఎస్‌లు
- పారిశుధ్య నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ అధికారుల ఆరా

నవాబ్‌పేట, ఫిబ్రవరి 5: వివిధ గ్రామాల్లో పారిశుధ్య నిధుల దుర్వినియోగం చిలికిచిలికి గాలివానలా మారుతున్నది. బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ మిషన్ల కొనుగోళ్లలో మండలంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు గతంలోనే పలు ఆరోపణలు వచ్చాయి. ఇందులో భాగంగానే ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్యే కోరిక మేరకు విచారణను విజిలెన్స్‌కు అప్పగించారు. కాగా విజిలెన్స్ అధికారులు విచారణకు సిద్ధమవుతున్న తరుణంలో పంచాయతీ కార్యదర్శుల్లో ఆందోళన మొదలైంది. సమగ్ర విచారణకు జీపీల రికార్డులన్నీ అప్పగించాలని విజిలెన్స్ అధికారులు పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తరుణంలో పంచాయతీ కార్యదర్శులు చేసేది లేక జరిగిన విషయాన్ని అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులకు విన్నవించుకుంటున్నారు. మండలంలోని సుమారుగా 20మంది పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు వెళ్లి అక్కడ వారి గోడు వెళ్లబోసుకున్నారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి విషయాన్ని వెల్లడించారు. పారిశుధ్య నిధుల దుర్వినియోగం విషయంలో తమ ప్రమేయం లేదని, మండల స్థాయి అధికారి క్రియాశీకంగా ఉన్నారని వివరించారు. మెటీరియల్ కొనుగోళ్లలో నకిలీ బిల్లులు సృష్టించి, గండీడ్ మండలంలో కొనుగోలు చేసినట్లు, నకిలీ బిల్లులు పెట్టి డబ్బులు స్వాహా చేశారని కలెక్టర్‌కు విన్నవించారు. ఈ ఘటనపై విజిలెన్స్ అధికారులతో సమగ్ర విచారణ జరిపించేందుకు ఉన్న తాధికారులు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

బహిరంగ ప్రకటన

ఇందు మూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు కమ్మరి బాలరాజు తండ్రి సాయన్న, పాలకొండ గ్రామ శివారు, మహబూబ్‌నగర్ గారి తరపున జారీ చేయు బహిరంగ ప్రకటన ఏమనగా, సర్వే నెం. 282/2 మొత్తం 228 Sq.yards, ప్లాటునెం. 12, పాలకొండ గ్రామశివారు, మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో చేర్చబడిన ప్లాటు యొక్క లింక్, డాక్యుమెంట్స్ నెం.1075/2005 Purchase చేసినాడు. Purchaser మంద ఉమ భర్త రత్నకర్ రెడ్డి వెండర్: టి. శ్రీకాంత్‌రెడ్డి తండ్రి టి.లక్ష్మీ నర్సింహారెడ్డి గారు అమ్మిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ నారాయణపేట నుండి మహబూబ్‌నగర్ బస్సు లో వస్తుంటే మిస్ అయినది. కావున ఆ రోజు రూరల్ పోలీస్ స్టేషన్ యందు కంప్లేంట్ చేసినాము. దానికి గాను మిస్సింగ్ సర్టిఫికెట్ ఇచ్చినారు. కావున తెలియజేయునది ఏమనగా, ఇట్టి ప్లాట్‌పై ఎవరికైన అభ్యంతరములు ఉన్నచో ఈ క్రింది చిరునామాలో (7) రోజులలో తమ అభ్యంతరాలను, హక్కులను తగు డాక్యుమెంట్స్ సంప్రదించగలరు.మరియు ఎవరికైనా సదరు డాక్యుమెంట్స్ దొరికినచో క్రింది చిరునామలో ఇవ్వగలరు.

G. MANOHAR SBI Panel Advocate
H.No.4-104, Bhageeratha Colony,
Mahabubnagar, Cell:9440212092

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, Hajilapur Village కి చెందిన Kethavath Govindu S/o Kethavath Shankar Naik, aged 28 years, Occ: Business R/o H.No.1-39, Ramsingh thanda, Hajilapur Village, Nawabpet Mdl., Mahabubnagar Dist. **Applicant / Borrower** నా క్లయింట్ అయిన శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, మహబూబ్ నగర్ బ్రాంచ్-1 గారికి ఇట్టి ఆస్తిని తనఖా (Mortgage)పెట్టి అప్పు తీసుకోవటానికి దరఖాస్తు చేసియున్నారు. ఇట్టి ఆస్తి విషయములో ఎవరికైనా ఎలాంటి హక్కులుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల ఈ క్రింది అడ్రస్సుకు (3) రోజుల లోపల తెలియజేయగలరు. లేని పక్షంలో ఇట్టి ఆస్తిపై ఎలాంటి అభ్యంతరములు లేవని భావించి నా క్లయింట్ అయిన శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, మహబూబ్‌నగర్ బ్రాంచ్-1 వారు షెడ్యూల్ ఆస్తిని తనఖా పెట్టుకొని అప్పును మంజూరు చేయుదురు. తరువాత వచ్చిన ఆక్షేపణలు చెల్లనేరవు.

ఆస్తి వివరాలు: All that the part & parcel of residential house plot bearing No.299 in Sy.No.830/A3, 827/1, 850/AA, 827/2AA, 850/AA, 826I1 & 826/2 an extent of 125 Sq.yards situated within the limits of Rajapur Village & Mandla, Mahabubnagar. **హద్దులు: East :** 30 ft. road, **West:** Plot No.308, **North:** Plot No.298, **South:** Plot No.300.

K. CHANDRA MOULI B.Com., LLB
Advocate, New Gunj, Hanuman Nagar, Mahabubnagar. Cell: 9440330760